

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

చాగల్లు : నిడదవోలు-పంగిడి ఆర్ అండ్ బి తారు రోడ్డు, సిసి రోడ్లు మధ్యన ఏర్పడిన గుంతలను ఎట్టకేలకు పూడ్చాచరు. చాగల్లు మెయిన్ బజార్‌లో బస్టాండ్ వద్ద కొంత కాలంగా ఈ గుంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు సైతం గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై ప్రజాశక్తి దినపత్రిక కథనాన్ని సైతం ప్రచురించింది. దీనికి ఆర్ అండ్ బి అధికారులు స్పందించారు. రోడ్డుపై గోతులను పూడ్చారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మూడో జాబితాలో ముగ్గురు

- ఒక పార్లమెంట్, రెండు అసెంబ్లీ స్థానాలకు టిడిపి అభ్యర్థుల ప్రకటన
- రాజమండ్రి ఎంపీ స్థానంపై కొనసాగుతున్న కూటమి కసరత్తు
- పి.గన్నవరం అసెంబ్లీ స్థానంపై వీడని ఉత్కంఠ

హరీష్ మాథూర్
అమలాపురం ఎంపీ అభ్యర్థి

అయితాబత్తుల ఆనందరావు
అమలాపురం ఎంఎల్ఎ అభ్యర్థి

వనమాడి వెంకటేశ్వరరావు
కాకినాడ సిటీ ఎంఎల్ఎ అభ్యర్థి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ కూటమి తమ అభ్యర్థుల ప్రకటనలో ఇంకా జాప్యం చేస్తూనే ఉంది. తాజాగా శుక్రవారం ఎట్టకేలకు మూడో జాబితా విడుదల చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అమలాపురం పార్లమెంట్ స్థానానికి గంటి హరీష్‌మాథూర్, కాకినాడ సిటీ అసెంబ్లీ స్థానానికి వనమాడి కొండబాబు, అమలాపురం అసెంబ్లీ స్థానానికి అయితాబత్తుల ఆనందరావు పేర్లను ఖరారు చేసింది. అయితే రాజమహేంద్రవరం పార్లమెంట్, పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థులపై ఇంకా కూటమి నేతలు కసరత్తులు చేస్తూనే ఉన్నారు. అధికార పక్షం అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాలను ప్రారంభించారు. ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రకటించిన స్థానాల్లో కూటమి అభ్యర్థుల సైతం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ఉన్న స్థానాల్లో టికెట్లను ఆశిస్తున్న నేతల్లో ఆందోళన నెలకొంది. ఎవరికి సీటు దక్కుతుందనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. మిగిలిన స్థానాలను కూడా త్వరితగతిని ప్రకటించాలని టిడిపి, జనసేన పార్టీల శ్రేణులు కోరుతున్నాయి.

కూటమి అభ్యర్థిగా లోక్ సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి కుమారుడు గంటి హరీష్‌మాథూర్‌ను మరోసారి అమలాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ సీటుపై టిడిపి అధిష్టానం తీవ్ర కసరత్తులు చేసింది. ఉమ్మడి జిల్లాలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం కీలకంగా మారడంతో దీన్ని టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ స్థానానికి మాజీ ఎంపీ ఎజెవిబి.బుచ్చిమహేశ్వరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ యాతాటి రమేష్‌బాబు పోటీపడ్డారు. వారి బలాలు, బలహీనతలను బేరీజు వేసిన టిడిపి అధినేత చంద్రబాబు చివరకు హరీష్‌మాథూర్‌కే మొగ్గుచూపారు. మరోవైపు అమలాపురం అసెంబ్లీ స్థానంపైనా అధినేత ఆచితూచి నిర్ణయం తీసుకున్నారు. సామాజిక సమీకరణలు, అర్థ, అంగబలం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఆనందరావుకు టికెట్‌ను ఖరారు చేశారు. ఈ స్థానాన్ని మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, టిడిపి సీనియర్ లీడర్ పడమటి శ్యామ్‌కుమార్ తదితరులు ఆశిస్తూ వచ్చారు. జగదీశ్వరి పలు సందర్భాల్లో అమలాపురం నుంచి పోటీకి సిద్ధమంటూ ప్రకటించారు. అయినప్పటికీ చంద్రబాబు ఆనందరావుకే టిక్కెట్‌ను కేటాయించారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఉత్కంఠకు తెరపడింది. మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకే ఈ సీటు దక్కింది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ఈ టిక్కెట్టు కోసం గట్టి ప్రయత్నాలే చేసినా ఫలించలేదు. మరోవైపు బిజెపి కూడా ముమ్మర ప్రయత్నాలు చేసింది. పోతుల విశ్వం, గట్టి సత్యనారాయణ వంటి నాయకులు పలుమార్లు ముఖ్య నేతల వద్దకు వెళ్లి తమ నిర్ణయాలను చెప్పుకున్నారు. తాజాగా టిడిపి నుంచి కొండబాబుకు టికెట్ కేటాయించడంతో బిజెపి ఆశావహుల్లో అసంతృప్తి నెలకొంది. ఎన్నికల్లో కొండబాబుకి సహకరించేది లేదంటూ ఆ పార్టీ శ్రేణులు నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు టికెట్ ఆశించి భంగపడ్డ చంద్రమౌళి కూడా తీవ్ర నిరాశతో అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. పార్టీకి ఆర్థికంగా అనేక సహాయ, సహకారాలు అందజేసినా తనకు సరైన గుర్తింపు లేదని మదన పడుతున్నారు. రెబల్‌గా సిటీ నియోజకవర్గ నుంచి పోటీలో ఉండాలని అనుచరులు కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మిగిలిన స్థానాల్లో ఉత్కంఠ

మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను ఇంకా ప్రకటించకపోవడంతో కూటమి ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానం దాదాపుగా బిజెపికి ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశం ఉంది. అయితే అధికారికంగా దీనిపై ఇంకా ప్రకటన వెలువడలేదు. త్వరలోనే ఈ మేరకు ప్రకటన వచ్చే అవకాశం ఉంది. అలాగే పి.గన్నవరం అసెంబ్లీ స్థానం అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. మహాసేన రాజేష్‌కు టికెట్ కేటాయించినప్పటికీ కొన్ని రాజకీయ పరిణామాలు చోటు చేసుకోవడంతో ఆయన పోటీ నుంచి వెనక్కి తగ్గినట్టు ప్రకటించారు. ఇదే స్థానాన్ని జనసేన నుంచి తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి గిడ్డి సత్యనారాయణ ఆశిస్తున్నారు. అందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరోవైపు బిజెపి కూడా ఈ స్థానంపై పట్టుబడుతుతోంది. అమలాపురం ఎంపీ చింతా అనురాధ భర్త టిఎస్ఎన్.మూర్తి గతంలోనే బిజెపిలో చేరారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆయన మాజీ ఐఆర్ఎస్ అధికారిగా ఉన్నారు. బిజెపి నుంచి ఆయన్ని బరిలో దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా టిడిపి మూడో జాబితా ప్రకటనతో జిల్లాలో ఎన్నికల సందడి మరింత ఊపు అందుకుంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచార పర్వంలో ఉన్నారు. ఏ ఇద్దరు కలిసినా అభ్యర్థుల గెలుపు, ఓటమిలపైనే చర్చ జరుగుతోంది. ఎక్కడ చూసినా ఎన్నికల సమావేశాలు, సమాలోచనలు, ఎక్కడ విన్నా అభ్యర్థుల బలాబలాలు వంటి అంశాలనే మాట్లాడుకుంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జెసి తేజ్ భరత్ తదితరులు

వ్యక్తిగత నిర్ధారణతో ఓటరు నమోదు

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి అంశాలపై బూత్‌స్థాయి అధికారిపై ఆధారపడకుండా రిటర్నింగ్ అధికారి వ్యక్తిగతంగా నిర్ధారణ చేసుకోవడం చాలా అవసరమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం వెలగపూడి నుంచీ ఎన్నికల ప్రక్రియ, తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలన్నారు. ఫారం -6కి సంబంధించి సహేతుకమైన విధానం, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుది ఓటరు జాబితా ప్రకటించిన తదుపరి ఫారం 7కి చెందిన 15,185 దరఖాస్తులు రాగా వాటిలో 12,825 ఆమోదించామన్నారు. 2,360 పరిశీలనలో ఉన్నాయన్నారు. రాజకీయ పార్టీలు తరపున, వ్యక్తిగతంగా ఎటువంటి ఎన్నికల ప్రచారం చేసిన వాటికి అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రలోభాలపై దృష్టి పెట్టడంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమన్వయం అవసరమన్నారు. వాటి వివరాలు తగిన వీడియో రికార్డింగ్ చేస్తూ, వెంటనే సంబంధిత నివేదికలు పంపాలన్నారు. నియోజక వర్గ స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు, సోషల్ మీడియాలో వచ్చే ప్రచార, అంశాలు తదితర వాటిపై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హింసలకు, ఎటువంటి ఎన్నికల నియమాలు ఉల్లంఘన జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రూరల్ రిటర్నింగ్ అధికారి జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, ఎస్‌డిసి - పార్లమెంటు ఎఆర్ఒ ఆర్.కృష్ణనాయక్, ఎంసిసి నోడల్ అధికారి, రుడా విసి బి.బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం జిల్లా అధికారి షేక్ ఖాదర్‌బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అచ్యుతాపురంలో పేరంటాల చెరువు, కొత్తపల్లిలో పెదపాత్రునిచెరువు, గోకవరంలో మేరకరాజు చెరువులో చేస్తున్న పనులను పరిశీలించారు. పని ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మంచినీరు, మెడికల్ కిట్స్, నీడ కోసం వేసిన షెడ్, ఒఆర్ఎస్ ప్యాకెట్లను పరిశీలించారు. కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎపిఒ పిఎస్.అప్పలరాజు, జెఇ రత్నరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న అధికారి ఖాదర్ బాషా

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో రబీ వరి కోతలు మొదలైన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు అన్నారు. కోసిన పంటలు దళారీలు తీసుకుపోతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి నేపథ్యంలో డ్రెయిన్లు, పంట బోదెల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. వంతెన వద్ద గుర్రపు డెక్క పేరుకుపోవడతో నీరు సరిగా ప్రవహించట్లేదన్నారు. వెంటనే గుర్రపు డొక్క తొలగింపు పనులు చేపట్టాలన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి పుంత రోడ్లు వేయాలని కోరారు.

4న అరసం వార్షికోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) తూర్పుగోదావరి జిల్లా ప్రథమ వార్షికోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు 18వ వర్ధంతి సందర్భంగా స్మారక పురస్కారాల కార్యక్రమం ఏప్రిల్ 4న ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ సమీపంలో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగే సభకు సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కర్రి రామారెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌పి.గంగిరెడ్డి, విశిష్ట అతిథిగా బొల్లినేని నాగార్జునసాగర్ పాల్గొంటారని తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు. పడాల రామారావు స్మారక పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకునే వారు పడాల వీరభద్రరావు సెల్ నెంబర్‌ను 9493281776ను సంప్రదించాలన్నారు.

6వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మెయిన్ బజార్‌లో గల మదన గోపాల స్వామి ఆలయం వద్ద వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం 6వేల మందికి అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సింహాద్రి జనార్దన్ రావు మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్వాహకులు సొలస ఉమ, గోకవరపు మాణిక్యం, అప్పన శ్రీకాంత్, కె.వినయ్, ఎ.వంశీ, సాయి, మణికంఠ తదితరులు పర్యవేక్షించారు.

ఈసీ మార్గదర్శకాలు పాటించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికలకు సంబంధించి ఈసీ సూచించిన మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పక పాటించాలని రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి సూచించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమ మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ప్రచారం నిమిత్తం తీసుకోవాల్సిన అనుమతులు, నామినేషన్‌కు సమర్పించాల్సిన డాక్యుమెంట్ల విషయంలో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎలక్టోరల్ రోల్స్, పోలింగ్ ఏజంట్ల విధులు, బాధ్యతలు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, బ్యాలెట్ యూనిట్ల వినియోగంపై సమగ్ర సమాచారం అందించారు. అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చు, విధివిధానాలు, రిజిస్టర్ల నిర్వహణపై సమగ్ర సమాచారం అందచేశారు. అనుమతుల కోసం సువిధా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమములో సహాయ రిటర్నింగ్ అధికారి, అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, బిజెపి నుంచి ఎ.శివనాగరాజు, కాంగ్రెస్ నుంచి కె.గంగరాజు, సిపిఐ నుంచి కె.రాంబాబు, సిపిఎం నుంచి బి.రాజులోవ, వైసిపి నుంచి ఇ.కామేశ్వరరావు, టిడిపి నంచి ఎం.అప్పారావు, జనసేన నుంచి వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మట్లాడుతున ఆర్‌డిఒ చైత్రవర్షిణి

వైసిపి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షునిగా నాని

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైసిపి యువజన విభాగం తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షునిగా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన పప్పొప్పుల నానిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తూ మరోసారి వైసిపి అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తానన్నారు. నాని నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మలకపల్లిలో తలారి ప్రజా ఆశీర్వాద యాత్ర

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లిలో ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు శుక్రవారం ప్రజాఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచారు. వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రజలను మోసగించేందుకు మూడు పార్టీలు కలిపి ఉమ్మడిగా వస్తున్నాయని వీరికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామానికి వచ్చిన తలారికి సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల కేశవ నారాయణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వం రావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఓటర్లకు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా అధికారులకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు ఓటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

విద్యార్థిపై కోతుల దాడి

- తప్పించుకోబోయి భవనంపై నుంచి పడిపోయిన బాలుడు
- తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలు

ప్రజాశక్తి - గోపాలపురం

తొమ్మిదో తరగతి విద్యార్థిపై కోతులు మూకుమ్మడిగా దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గోపాలపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు ముస్తఫా, షెహనాజ్ తెలిపిన వివరాల మేరకు... గోపాలపురం మసీదు వీధిలో ఒక బిల్డింగులో మొదటి అంతస్తులో వారు కొంతకాలంగా అద్దెకు ఉంటున్నారు. వారి కుమారుడు సయ్యద్ అమన్ వేలచింతలగూడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం స్కూలుకు బయలుదేరాడు. ఈ సమయంలో సుమారు 10 కోతులకు పైగా కోతులు విద్యార్థిపై దాడికి దిగాయి. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు, బంధువుల సహాయంతో హుటాహుటిన కొయ్యలగూడెంలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఎడమ చేయి విరిగిందని, నడుము భాగంలో దెబ్బలు తగిలాయని తల్లిదండ్రులు వాపోయారు.

కోతుల బెడదపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని స్థానికులు తెలిపారు. మసీదు వద్ద కోతులు బెడద మరీ అధికంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని ప్రజాశక్తి సైతం పలుమార్లు కథనాలను ప్రచురించింది. చిన్నారుల నుంచి పెద్దల వరకూ ప్రతి రోజూ ఎవరొకరు గాయపడుతున్నారని తెలిపారు. ఇంట్లోకి చొరబడి వస్తువులు సైతం ఎత్తుకెళ్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

గాయపడిన విద్యార్థి అమన్

నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

115 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చివటంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. పరమ హంస యోగానంద నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో 115 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారిని రాజమండ్రి పంపినట్లు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.విష్ణువర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ ఆర్‌కె.ఫణిధర్, అధ్యాపకులు భూపాల్, డాక్టర్ ఐవి.నారాయణ, నేత్ర వైద్యశాల ప్రోగ్రాం మేనేజర్ ఎన్.చంటిబాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విగ్రహం విషయంలో వివాదాలు వద్దు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విగ్రహం విషయంలో వివాదాలు వద్దని పోలీసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని మోర్త, వెలగదుర్రు, తాడిపర్రు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. కొంతకాలంగా గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం విషయంలో వివాదం నడుస్తోంది. ఇది ఆర్‌డిఒ కోర్టులో ఉంది.ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహానికి వేసిన ముసుగులను తొలగించి అలజడి సష్టించారు. అయితే అప్రమత్తమమైన రెవెన్యూ సిబ్బంది తిరిగి యథావిధిగా ముసుగు వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.అప్పలరాజు మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా విగ్రహం పరిసర ప్రాంతాలతో పాటు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సత్యనారాయణ, విఆర్ఒ లక్ష్మీనరసమ్మ, మహిళా పోలీస్ ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వేతన ఒప్పందం చర్చలు సఫలం

ప్రజాశక్తి -దేవరపల్లి

గౌరీపట్నం లారీ కార్మికుల వేతన ఒప్పందం చర్చలు సఫలం అయ్యాయి. నూతన వేతన ఒప్పందంపై 20 రోజులుగా పలు దఫాలుగా యజమానులతో చర్చలు జరిగాయి. శుక్రవారం క్వారీ అండ్ క్రషర్ యాజమాన్య అసోసియేషన్ నాయకులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిపిన చర్చలు సఫలం అయ్యాయని నాయకులు తెలిపారు. ప్రస్తుతం లారీ డ్రైవర్‌కు ఇచ్చే నెల జీతంపై రూ.3,400 రూపాయలు పెంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. హెల్పర్‌కు డ్రైవర్‌కి ఇచ్చే జీతంలో సగం జీతం ఇచ్చేందుకు, రోజువారీ బేటాలపై రూ.40 పెంచేదుకు, నెలకు ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇచ్చేందుకు అంగీకరించారు. ఏడాది పాటు పనిచేసిన కార్మికులకు ఒక నెల వేతనం బోనస్‌గా ఇస్తారు. ఒక జత బట్టలు తదితర అంశాలపై యజమానులు అంగీకరించారు. ఈ చర్చల్లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు ఎస్‌కె.మస్తాన్, ఇఫ్టూ నాయకులు పి.నాగేశ్వరరావు, సిహెచ్.రమేష్, ఐఎన్‌టియుసి నాయకులు దుర్గారావు యూనియన్ నాయకులు ఆకాష్ ప్రసాదరావు, ఏడుకొండలు సత్యనారాయణ, దుర్గారావు, నాగరాజు యజమానుల సంఘం నుంచి పి.సోమేశ్వరరావు, గౌరీబాబు, సూర్యనారాయణరాజు అనంత్ రెడ్డి, చిన్ని వెంకట్ తదితరులు పాల్గొన్నారు

ఒప్పంద పత్రాలను అందిస్తున్న యజమానుల సంఘం నాయకులు

రెండు పొగాకు బేరన్ల దగ్ధం

రూ.7లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - గోపాలపురం

దొండపూడిలో ప్రమాద వశాత్తు రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమవడంతో రూ.7 లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన మద్దాల స్వాతి, పెనుబోతుల నాగజ్యోతి మౌనికలకు చెందిన పొగాకు బ్యారన్లలో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. మద్దాల స్వాతికి చెందిన బ్యారన్ పూర్తిగా కాలి బూడిదైంది. రూ.5 లక్షల వరకు నష్టం వాటిలింది. పెనుబోతుల నాగజ్యోతిమౌనికకి చెందిన బ్యారన్ దగ్ధం అవడంతో రూ.2లక్షల నష్టం వాటిల్లిందని కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. స్థానికంగా ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుటు నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. జంగారెడ్డిగూడెం, కొవ్వూరు నుంచి ఫైరింజన్లు వచ్చేసరికి జరగాల్సి నష్టం మొత్తం జరిగిపోతుందని తెలిపారు.

దగ్ధమవుతున్న పొగాకు

నేరాలు ఘోరాలు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం, గండేపల్లి

గంజాయిని తరలిస్తున్న నలుగురిని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు అరెస్టు చేశారు. రాజానగరంలో ఇద్దరు మహిళలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల మేరకు చింతపల్లి అటవీ ప్రాంతం నుంచి చెన్నయ్‌కు చెందిన ఇద్దరు మహిళలు జర్నీ ట్రాలీ బ్యాగ్‌లో గంజాయిని పెట్టుకుని బస్సులో ప్రయాణిస్తున్నారు. తూర్పు గోనుగూడెం జాతీయ రహదారి చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇది గమనించిన మహిళలు చెక్ పోస్టు సమీపంలో బస్సు దిగిపోయారు. గంజాయి ఉన్న ట్రాలీ బ్యాగ్‌లను తీసుకుని కంగారుగా వెళ్తున్నారు. గమనించిన పోలీసులు వారిని ఆపి తనిఖీ చేశారు. బ్యాగుల్లో 20 కేజీల గంజాయిని గుర్తించారు. దీని విలువ రూ.2.10లక్షలు ఉంటుందని తెలిపారు. వెంటనే వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

గండేపల్లి మండలంలో జాతీయ రహదారిపై గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట సిఐ లక్ష్మణరావు తెలిపారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన కాపవరపు బాలాజీ, జగ్గంపేట గ్రామానికి చెందిన నైనపు సురేష్ బైక్‌పై 23 కేజీల గంజాయిని తీసుకుని వెళుతుండగా మురారి గ్రామంలో చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ నోడు రామకృష్ణ, పోలీస్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు.

పోక్సో కేసు కొట్టివేత

ప్రజాశక్తి-కాకినాడ

బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎంవిఆర్. ఉపేంద్రపై నమోదు చేసిన పోక్సో కేసును కాకినాడ పోక్సో కోర్టు జిల్లా జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు కొట్టి వేస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. 2019లో పిఠాపురం టౌన్ ఎస్ఐ అబ్దుల్ నబీ ఉపేంద్రపై లైంగిక వేధింపుల ఆరోపణలపై కేసు నమోదు చేశారు. అసోసియేషన్ లో ఒక క్రీడాకారిణిపై ఉపేంద్ర లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చెయ్యడంతో కేసు నమోదు చేశారు. ఆరోపణలు రుజువు కానందున కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న ఐదేళ్ల బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక చర్యకు పాల్పడడంతో పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దిశ డిఎస్పి రామచంద్రరావు ఆధ్వర్యంలో జగ్గంపేట ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

85 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎస్ఈబి అధికారులు ఏలేశ్వరం ప్రతిపాడు మండలాల్లో దాడులు నిర్వహించి 85 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, పెద్ద ఎత్తున బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఇబి సిఐ ఎల్.చిరంజీవి తెలిపిన వివరాలివి. ఏలేశ్వరంలో 35 లీటర్ల సారాతో పాటు అమ్మకానికి సిద్దంగా ఉంచిన 8 లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకుని తల్లీ కొడుకులు పై కేసు నమోదు చేశామన్నారు. ప్రతిపాడు మండలం వేములంపాలెంలో నిల్వ ఉంచిన 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే గ్రామంలో మరో ప్రాంతంలో పెద్ద ఎత్తున బెల్లపు ఊట ధ్వంసం చేసి 30 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం.ఆశాలత, సిబ్బంది వెంకన్న దొర, కృష్ణార్జున రావు, దొరబాబు, రాజు, వీరభద్రరావు ఉన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం దుళ్ల గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కెఎస్ఎసి సూర్యారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేశారు. సూర్యారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, అగ్రికల్చర్ ఇన్‌పుట్ అవుట్‌లెట్ ఎరువుల షాప్‌లో తనిఖీలు చేశామన్నారు. స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించలేదని, బిల్లులపై రైతు సంతకాలు లేవని, స్టాక్ బోర్డు అప్డేట్ చేయలేదని తెలిపారు. ఈ మేరకు షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. రూ.1,08,331 విలువ చేసే 3.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశామన్నారు. పురుగు మందుల అమ్మకాలు 21 రోజులపాటు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, భార్గవ మహేష్, కడియం మండల వ్యవసాయ అధికారి ద్వారకా దేవి పాల్గొన్నారు.

80 పట్టు చీరల స్వాధీనం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

పిఠాపురం నుంచి ఉప్పాడ రోడ్డు మార్గంలో వస్తున్న కారులో 80 పట్టు చీరలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల తనిఖీ అధికారి బుర్రా వేణుగోపాల్ తెలిపారు. బిల్లులు లేకపోవడంతో చీరలు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ధర్మవరం గ్రామంలో మూడి సరుకులు ఇచ్చి చీరలు తయారు చేయించి విక్రయించేందుకు ఉప్పాడ చీరల షాప్‌కు వెళ్తూ ఉంటామని బాధితుడు కాకి చక్రధర్రావు తెలిపారు. చేనేత మగ్గంపై తయారుచేసిన వాటికి ఇటువంటి బిల్లులు ఉండవని బాధితుడు తెలిపారు.

పలు గ్రామాల్లో 'కందుల' పర్యటన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని వెంకటరాయపురం, అజ్జరం, పెరవలి, కొత్తపల్లి గ్రామాల్లో కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్, టిడిపి నాయకులు బూరుగుపల్లి శేషారావు పర్యటించారు. కార్యకర్తలతో సమావేశమయ్యారు. బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కందుల దుర్గేష్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కందుల దుర్గేష్ మాట్లాడుతూ పెరవలిలో టిడిపి బలంగా ఉందన్నారు. వారందరూ సమష్టిగా పనిచేసి తనను గెలిపించాలని కోరారు. శేషారావు సలహాలు, సూచనలతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అతికాల శ్రీను, జనసేన మండల అధ్యక్షులు పిప్పర రవి పాల్గొన్నారు.

గంజాయి నేరగాళ్లతో సంబంధం ఏంటి?

మీడియా సమావేశంలో ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

హైదరాబాద్ గంజాయి కేసులో అడ్డంగా బుక్కయిన జాకీ, చోటూలు ఆదిరెడ్డి వాసుతో అత్యంత సన్నిహితంగా ఉండేవారేనని, ఇప్పుడు వారు తెలియదంటే ఎలా? అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గంజాయి వ్యాపారాన్ని యధేచ్చగా సాగిస్తున్నది టిడిపి నేతలే విషయం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో గంజాయితో పోలీసులకు చిక్కిన జాకీ, చోటూలతో వాసు సన్నిహితంగా ఉన్న ఫోటోలను ఆయన ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. గంజాయి మాఫియాతో వాసు అన్న, ఇటువంటి నేర చరిత్ర కలిగిన వారు రాజకీయాల్లోకి రావడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఒక పోలీసు అధికారికి ఆదిరెడ్డి వాసు ఫోన్ చేసి మాట్లాడి.. ఆ ఆడియో రికార్డును

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

తన అఫిషియల్ ఫేస్ బుక్ ద్వారా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పైకి తీసుకు రావడం నేరమేనన్నారు. విధుల్లో ఉన్న ఒక పోలీసు అధికారితో మాట్లాడి, సదరు అధికారి అనుమతి లేకుండా ఫేస్ బుక్‌లో పెట్టడం రాజద్రోహం కిందకు వస్తుందన్నారు. ఐపిసి 54, ఐపిసి 353, 123 ప్రకారం తీవ్ర నేరంగా పరిగణిస్తారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా డిజిపికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

నగరంలో ఒక ఎంపీగా ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోవడం కూడా ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు నేరంగానే కనిపించడం శోచనీయమన్నారు. ప్రతి విషయాన్ని భూతద్దంలో నుండి చూపిస్తూ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఆదిరెడ్డి కుటుంబం 16 ఏళ్లుగా నగరానికి, నగర ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. రాచరిక వ్యవస్థ మాదిరిగా ఆ కుటుంబమే అధికారాన్ని అనుభవించాలా అన్నట్లు భావించడం వారి అహంకారాన్ని వెల్లడిస్తోందన్నారు. తనకు ప్రజాభిమానం మెండుగా తనకు ఉండటంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీటన్నిటికీ ప్రజలే సరైన సమాధానం చెప్పే రోజులు ఆసన్నమవుతున్నాయని ఎంపీ భరత్ అన్నారు.

ఎంపీగా భరత్‌రామ్ ఫెయిల్

ప్రచారం తప్పితే పనితనం లేదు
విలేకర్ల సమావేశంలో కూటమి నాయకులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎంపీగా మార్గాని భరత్‌రామ్ పూర్తిగా ఫెయిల్ అయ్యారని, వెండి తెర రంగుల ప్రపంచం ఒక్క తన్ను తన్నితే అక్కడి నుంచి ఎగిరివచ్చి గాలి వాటంలో ఎంపీ అయ్యాడని అవే రంగులను రాజమండ్రికి అద్ది ఇదే అభివృద్ధి అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని కూటమి నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షులు రాజేష్ కన్నా, కార్యదర్శి తేజోమూర్తుల నర్సింహారావు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావులపల్లి ప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బూర రామచంద్రరావు మాట్లాడారు. ప్రజల సొమ్ముతో ఎంపీ మార్గాని భరత్ రామ్ సోకులు చేస్తున్నాడన్నారు. కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లించిన వివిధ రకాల పన్నులతోనే నగరంలో వివిధ పనులు చేసిన భరత్ రామ్ తానేదో తన సొంత డబ్బులు లేదా ఎంపీ లాడ్స్ నుంచి కేటాయించి చేయించినట్లు బిల్డప్ కబుర్లు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అతడి వ్యవహారం చూస్తుంటే సోమ్మొకడిది, సోకొకడిది అనే చందంగా ఉందన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై ఓడిపోతున్నట్లు గ్రహించిన భరత్ రామ్ ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో వాలంటీర్లను ఓటర్లను ప్రలోభాలకు గురిచేయించడాన్నారు. ఈ నేపథ్యం పని వల్ల 23 మంది వాలంటీర్లు సస్పెండ్‌కు గురై ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరానికి మంజూరైన రూ.125 కోట్లను శ్వేత పత్రం విడుదల చేసి నిజాయితీ నిరూపించుకో వాల్సిన బాధ్యత భరత్‌రామ్‌పై ఉందన్నారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసిందని, వీటిలో తొలివిడతగా రూ.38 కోట్లను రాబట్టుకోవడంలో భరత్‌రామ్ విఫలమయ్యాడన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈ సమావేశంలో నామా సత్యనారాయణ, కొమ్మర్ల బాబ్జి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల కమిషన్ నూతనంగా నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు ఓటు హక్కును సద్వినియోగం చేసు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్‌పై విద్యా శాఖ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకి, ఇతర అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి తేజ్ భరత్ మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగస్వామ్యం అయ్యే అధికారులు, సిబ్బంది, ఇతర విధుల్లో భాగస్వామ్యం అయ్యే వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై పోలింగ్ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమం సందర్భంలో వారి నుంచి నిర్దిష్ట 12డి ఫారం(అప్లికేషన్ ఓటర్ వివరాలు)ద్వారా అంగీకారం స్వీకరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఒట్లను స్వీకరించిన తదుపరి ఆయా నియోజకవర్గాలకు

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

పంపిస్తామన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద డిక్లరేషన్ ఫారం స్వీకరించడం అత్యంత ప్రాధాన్యం అన్నారు. తదుపరి హెడ్ మాస్టర్లను వారి వారి టీచర్లకు ఎన్నికల మీద పూర్తి అవగాహన కల్పించడానికి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని తేజ్ భరత్ తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు వైదెహి.ఆర్.ప్రసాద్, బి.రమాదేవి, ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కెవి.రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మంచినీటి సామర్థ్యం గురించి వివరించారు. శాంతిని పెంపొందించడంలో శక్తి వివిధ్యాలన్ని సృష్టించగలిగే సామర్థ్యం నీటికి ఉంటుందన్నారు. నీటి కొరత లేకుండా నీటి కలుషితమైనప్పుడు లేదా ప్రజలు ప్రాప్యత కోసం పోరాడుతున్నప్పుడు సమాజంలో ఉద్రిక్తతలు తలెత్తుతాయన్నారు. నీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం ద్వారా శాంతి సాధ్యమన్నారు. సుస్థిరమైన నీటి వినియోగం చుట్టూ ఐక్యం కావడం ద్వారా సమాజాలు, దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందించాలని వివరించారు. ఈ కార్యక్రమం జాతీయ సేవా పథకం అధికారులు సునీత, డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ అనూరాధ, డాక్టర్ ప్రవీణ ,డాక్టర్ నిర్మల, రవికుమార్, డాక్టర్ దక్షిణామూర్తి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. .

ఒడిగోస్‌కు గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక రమణయ్యపేటలో ఏపిఎస్‌పి వద్ద ఉన్న విజెఎస్‌ఎంఆర్.ఒడిగోస్ టెక్ సాఫ్ట్‌వేర్ అండ్ ట్రైనింగ్ రిక్రూట్‌మెంట్ కంపెనీగా గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డ్ దక్కించుకుంది. దీంతో కంపెనీ క్యాంపస్‌లో శుక్రవారం అభినందన సమావేశం నిర్వహించారు. ఒడిగోస్ టెక్నాలజీస్ మేనేజింగ్ పార్టనర్ వాడ వినోద్ మాట్లాడుతూ బుధవారం ఢిల్లీ లోని హోటల్ రాడిసన్ బ్లూలో జాతీయ టూరిజం శాఖ మంత్రి శ్రీపాద ఏసో నాయక్, బాలీవుడ్ హీరోయిన్ ఊర్మిళ ఈ అవార్డును అందజేశారని తెలిపారు. సివెప్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ సంస్థను ప్రశంసించారు. వాడ సత్యనారాయణ, డాక్టర్ వంశీకృష్ణ రాజా, గంగారెడ్, వాసిరెడ్డి ఏసుదాస్, డాక్టర్ పివిఐ.సత్యనారాయణ, ధర్మారావు, రేఖ రెడ్డి అబ్రహం, బాలాజీ,

అవార్డు అందుకుంటున్న ఒడిగోస్ ప్రతినిధులు

జాషువాగిరి, మచ్చ బుజ్జి, జి.విల్సన్, మేరీ జ్యోతి, ఒడిగోస్ మేనేజర్ శిరీష, ప్రియా, లారా, విజయ్ పాల్గొన్నారు.

మూతబడిన పరిశ్రమలు తెరిపించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడి వేలది మంది కార్మికులకు ఉపాధి దూరమైందని, తక్షణం మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బిక్కవోలు మండలంలో గాయత్రి బయో ఆర్గానిక్స్ షుగర్స్ పరిశ్రమను గుజరాత్‌కు చెందిన బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ 2018లో కొనుగోలు చేసిందన్నారు. ఐదేళ్లు పూర్తికాకుండానే నేడు కృత్రిమ నష్టాలు చూపించి మూసివేతకు సిద్ధపడిందని చెప్పారు. ముడి సరుకు లభించక లేఆఫ్ ప్రకటించాల్సి వచ్చిందని కార్మికులకు యాజమాన్యం చెప్తుందన్నారు. ఇది తప్పుబట్టారు. కేవలం పర్మినెంట్ కార్మికులను వదిలించుకునేందుకు, వేతన ఒప్పందాన్ని ఎగవేయడం కోసమే ఈ కృత్రిమ నష్టాలను చూపిస్తున్నారని తెలిపారు. మోడీ తెచ్చిన చట్టాల ప్రకారం ఏ హక్కులూ లేని తక్కువ వేతనాలతో పని చేసే కార్మికులతో నడపాలనే దుర్బుద్ధి యాజమాన్యానికి కలగడం వల్లే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. ఈ పరిశ్రమపై ఆధారపడి 300 కుటుంబాలు, పరోక్షంగా 100 కుటుంబాలు జీవనం

కార్మికశాఖ కార్యాలయం వద్ద కార్మికులు

సాగిస్తున్నాయన్నారు. 2022లో సామర్లకోట సుగర్ పరిశ్రమ మూతబడి ప్రత్యక్షంగా రెండు వేల కుటుంబాలు, పరోక్షంగా వేలాది కుటుంబాలు నష్టపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకుని పరిశ్రమలు నడిచేందుకు ప్రయత్నించాలని, కనీ జిల్లాలో ఆలాంటి ప్రయత్నాలు సిఐఒ జగన్ చేయకపోవడం దురదృష్టం అన్నారు.

నీరు లేనిదే జీవకోటి మనుగడ లేదు

ప్రజాశక్తి-పిఠాపురం

నీరు లేనిదే జీవకోటికి మనుగడ లేదని, నీటిని పొదుపుగా వినియోగించుకుంటామని హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.జోజిబాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ నీటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా జోజిబాబు మాట్లాడుతూ నీరు సంపూర్ణంగా లభిస్తుందని విచ్చలవిడిగా వాడుతూ దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు తరాలకు నీటిని కన్నీళ్లతో చూడాల్సి వస్తుందన్నారు. గతంలో మన పూర్వీకులు చెరువుల్లో నీళ్లు తాగే వారని తరువాత తరం బావులు, ప్రస్తుత తరం బాటిల్ ద్వారా చూస్తున్నామన్నారు. నీటిని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తే రాబోయే భవిష్యత్తు తరాలు బాటిల్ మూతల్లో నీటిని చూసే పరిస్థితి వస్తుందన్నారు. మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని

నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

కాపాడుకుంటూ.. వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల ద్వారా ఆ నీటిని మళ్లించి భూగర్భ జలాలను పెంచాలని కోరారు. చెట్లను విరివిగా పెంచడం ద్వారా మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, పవన్ కుమార్, ఎస్.కె.రఫీ, ఆర్.వీర గణేష్, ఎస్.కె.కరీముల్లా, నాయకులు రామకృష్ణ, రాజు, కన్నా, కరుణ రాజు, చిన్న కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - బిక్కవోలు

రంగాపురంలో అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి సిఎం జగన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి డాక్టర్‌ను గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పోతుల ప్రసాద్‌రెడ్డి (బుజ్జి), ఎస్.వెంకటరమణ, వీరభద్రరావు, డివిఎ.రెడ్డి, బుంగా రామారావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 34వ డివిజన్‌కు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకిరామయ్య, రాజమండ్రి పార్లమెంట్ డాక్టర్ల సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, మాజీ కార్పొరేటర్ రెడ్డి పార్వతి, 34 డివిజన్ టిడిపి నాయకులు బివి.శివారెడ్డి, పులి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి ఆదిరెడ్డి శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా క్రమించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి మ్యానిఫెస్టోను, జగన్ నియంత పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, తెలుగు యువత నాయకులు సింహ వెంకటేష్, కొల్లి నాని, ఎమ్‌డి.రిజ్వాన్, రొక్కం భూషణాచారి, సూర్యచారి, మంజుల సాయికులు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెంలో రాంజీ ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ వైసిపి నాయకులతో కలిసి 3వ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. వైసిపిని గెలిపించాలని కోరారు. తోట నరసింహం ఎంఎల్ఎగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొనసాగిన 'మద్దిపాటి' పాదయాత్ర

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలంలో టిడిపి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు పాదయాత్రను కొనసాగించారు. అవ్వనపాలెం, నల్లజర్ల, పుల్లలపాడు, ముసుళ్లగుంట, దూబచర్ల, గంట వారి గూడెంలో పాదయాత్ర సాగింది. మహిళలు ఆయనకు హారతులు పట్టారు. తాను గెలిచిన వెంటనే నల్లజర్లలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి బ్రహ్మరాజు, జమ్ముల వీరవెంకటసతీష్, ఎలమటి శ్రీనివాసరావు పసుపులేటి రతీష్, నిమ్మలపూడి ప్రసాద్, కె.వెంకటరత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.సువర్ణరాజు, మండల అధ్యక్షులు సోడదాసి బాబిరాజు, సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీగా రాఘవ

ప్రజాశక్తి - చాగల్లు

వైసిపి యువజన విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీగా చిక్కాలకు చెందిన తాత రాఘవ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఉయినం నాగరాజు, బర్రా రజిని తదితరులు రాఘవకు అభినందనలు తెలిపారు.

బ్రాహ్మణగూడెంలో 'ముప్పిడి' పర్యటన

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక పరిశ్రమ కూడా రాలేదన్నారు. చంద్రబాబు తీసుకొచ్చిన పరిశ్రమలు కూడా పక్క రాష్ట్రానికి తరలిపోయాయన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమం జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజన్సీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఉదయం యానాం సబ్ జైలు రోడ్డు, పరంపరప్రాంతంలో తుప్పలను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యానాం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థులుగా నమశ్శివాయం, వైద్యలింగం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఏప్రిల్ 19న జరిగే లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పుదుచ్చేరి ఎన్.ఆర్.కాంగ్రెస్ పార్టీ, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా ఎ.నమశ్శివాయంను ప్రకటించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా కాంగ్రెస్ ఎంపీ వైద్యలింగంను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అన్నా డిఎంకె.అభ్యర్థిగా తమిళ వేందన్ను ఈ పార్టీ ప్రకటించింది.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KAKINADA
O.S. No. 1168/2022

Between :
THE KARNATAKA BANK LTD., rep. by its Branch Manager, a banking company, Regd. under the companies Act 1913, having its Regd. Office at Mahaveer Circle, Kankanady, Mangalore and a Branch Office amongst other Branches at Kakinada, Rep. by its Branch Manager, Kakinada. ....Plaintiff

And

1) CHEKURI KASI VISWESWARA RAO & ANOTHER ....Defendants

To, Defendant - 1:
Chekuri Kasi Visweswara Rao, S/o. (Late) Ch. Padharaju, Business, D.No. 1-14-02A, Gopal Nagar, Yanam, Pondicherry State.

పై నెంబరు దావా యందు ప్రతివాది అయిన మీకు ఈ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసు పంపినను తీసుకొనక తిరస్కరించబడినందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయడమైనది. కావున శ్రీ కోర్టువారు మీ కేసును **ది. 26-04-2024 సం॥లకి** వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని॥**లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీపై ఏక పక్ష తీర్పు ఇవ్వబడును.

// శ్రీ కోర్టువారి ఆజ్ఞ ప్రకారం //
వేమూరి చంద్రమౌళి
వాది తరపు న్యాయవాది
డో.నెం. 7-7-4/7A, ఆంధ్రా బ్యాంక్ ప్రక్క, అశోక్ నగర్, కాకినాడ - 3,
ఫోన్: 0884-2345652, 9849545912

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P. No.94/2023

Between:
పిటిషనర్లు: 1) గంగాప్రోలు లోకేశ్వరాయి 2) గంగాప్రోలు వీరలోకేష్

1, 2 పిటిషనర్లు మైనరు అయినందున వారి తల్లి గంగాప్రోలు సునీత, W/o. లేటు దుర్గా ప్రసాద్, డో.నెం.45-19/1, ఉప్పువారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా

మరియు
రెస్పాండెంట్లు: Nill

పై పిటిషన్ దారుల మొక్కు తండ్రి గంగాప్రోలు దుర్గా ప్రసాద్ గారు కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో చేసిన డిపాజిట్లు, అతని పేరున ఉన్న ఆస్తులు, ఇన్సూరెన్స్ మొదలగు వాటిని పొందుటకై, 1, 2 పిటిషనర్లు యొక్క వారసత్వపు ధృవపత్రము కొరకు ఈ పిటిషను దాఖలు చేయడమైనది. ఇందులో ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో **ది.02-04-2024**న ఉదయం **గం. 10-30 ని॥**లకు కోర్టువారి ఎదుట హాజరై తమ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల పిటిషనర్లకు వారసత్వపు ధృవపత్రము మంజూరు చేయబడును.

SCHEDULE: Madras Terraced building with Ground and First Floor alongwith site in an extent of 126 sq.yds. or 105.84 sq.mtrs. in D.No.33-5-26 in assessment NO.1060007138, T.S. No.497, Ward No.14, Block No.33, Near Market, Kancharlavari Street, previously Kakinada Municipal area, presently Kakinada Municipal Corporation area, Kakinada Registry, Kakinada Urban Mandal, previously East Godavari District, presently Kakinada District within the following boundaries:
East: 81' or 24.62 meters - Property of Bhimala Satya Padma, **West:** 81' or 24.62 meters - Property of Sunkara Ramarao, **North:** 14' or 4.25 meters - Property of Repaka .Sarvesh Kumar, **South:** 14' or 4.25 meters - Municipal Road.
In the above boundaries an extent of 126 sq.yds. out of it undevided 70 sq.yds with proportionate share in ground and first floor in the building D.No.33-5-26 with all electric fittings, meter deposits, water ways, common ways with all easementary rights etc.

కాకినాడ
ది. 15-03-2024
అల్తాఫ్ మహమ్మద్
పిటిషనర్ల తరపు అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848047860

ఓం నమో వేంకటేశాయ నమః
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ బాలబాలాజీ దేవస్థానం, అప్పనపల్లి
మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సీల్డు టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన
ఆర్.సి. నెం. బి5/268-3/2024, తేది: 22-03-2024

ది. 27-03-2024వ తేదీ ఉ॥ గం॥ 02.00లకు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, అప్పనపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీ బాలబాలాజీ దేవస్థానం నందు ఈ దిగువ ఉదహరించిన వాటికి సీల్డు టెండరు-కమ్-బహిరంగ వేలం బెండర్లు నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	కాలపరిమితి	ధరావత్తు రూ.
1.	పెండ్లి మండపములు (3వ మారు) (సీల్డు టెండరు)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	1,00,000-00
2.	శ్రీస్వామివారికి భక్తులు సమర్పించిన బియ్యం ప్రోగుచేసుకుని తీసుకొనిపోవు హక్కునకు (సీల్డు టెండరు (3వ మారు)	అప్పగించిన తేదీనుండి 2 సం॥ల కాలపరిమితికి	50,000-00
3.	స్టేషనరీ (సీల్డు టెండరు) (3వ మారు)	01-04-2024 నుండి 31-03-2025 వరకు	20,000-00

షరతులు: 1. సీల్డు టెండరుకు దాఖలు చేయువారు రూ. 1,000/-లు చెల్లించి టెండరు షెడ్యూల్ కార్యాలయం పనివేళలందు ది. 23-03-2024వ తేదీన 10 గం॥ల నుండి ది. 27-03-2024 ఉ॥ 12.00 గం॥ వరకు పొందవచ్చును. 2. సీల్డు టెండరు / బహిరంగ వేలం పాటలలో పాల్గొనువారు ధరావత్తు సొమ్మును కార్యనిర్వహణాధికారి, శ్రీ బాల బాలాజీ దేవస్థానం వారి పేరున ఏదేని జాతీయ బ్యాంకు నుండి డి.డి. తీసి టెండరుతో జత చేయవలెను. లేదా సీల్డు టెండరు / బహిరంగ వేలం పాటలలో పాల్గొనువారు నగదు రూపేణ చెల్లించి సదరు వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చును. సీల్డు టెండర్లు దాఖలు చేయుటకు ది. 27-03-2024 ఉ॥ 01.00 గంటల లోపు టెండరు బాక్సు నందు వేయవలెను. 3. సీల్డు టెండర్లు ఆరోజు అదగా తేది. 27-03-2024 మ॥ 02.00 గం॥లకు భక్తులు సమక్షంలో తెరవబడును. బహిరంగ వేలం సమక్షంలో తెరవబడును. 4. ఇతర షరతులు మరియు వివరములు కార్యాలయం పనివేళలందు ఫోన్ నెంబరు 08862-239562, 9491000720, 9652323999 ద్వారా తెలుసుకొనవచ్చును.

అప్పనపల్లి
22-03-2024
సహాయ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి